# కర్టెన్ లెక్చర్స్ (1)

ఏమండోయ్! ఏదీ నోరు తెరవండి, వక్కా పలుకు వేసాను. నోట్లో రెండు మెతుకులు వేసుకొన్నారో లేదో అప్పుడే అంత నిద్రా! లేవండి దుప్పటి మారుస్తాను. పిల్లలు తొక్కారు ఇసక బరబరలాడ్డంలే! నిజవే (నిద్ర సుఖమేరగ దన్నారు.) రేడియో కట్టేసి. లైటు తీసెయ్య మంటారు. ఇప్పుడే తీరికయింది. సీరియల్ చదువు తున్నాను. బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది! లేచారూ దీపం ఆర్పేశారంటే నన్ను చంపుకు

తిన్నట్టే! పేకాటకెళ్ళి వచ్చినప్పుడూ. రోడ్లన్నీ తిరిగి వచ్చినప్పుడూ ఈ నిద్రంతా ఎక్కడి కెళ్తుంది. చెప్మా! నా మొహం చూడగానే మీకు నిద్ర. ముసుగూ. చలీ వొణుకు నా శ్రాద్ధం అన్నీనూ. నేను సీరియల్ చదవడం మానేస్తాను! పోనీ సెకండ్ షో సినిమాకెళ్దాం - లేచి కూర్చోండి. ఇదిగో చొక్కా. ఇదిగో ప్యాంటూ. జోళ్ళు! కళ్ళజోడు. పర్సు. రిక్షా పిలిచేదా? లేవరూ - లైటార్పేశారూ? వెధవ గొడవ- నోరు ముయ్యమంటారా? మూస్తాను. ముయ్యనూ- వంటలక్కలాగ అవర్చిపెడితే మింగి కూర్చుని కబుర్లాడరూ....అడ్డారు. దాసీ దాన్లాగా ఈ దిక్కుమాల్ని చాకిరీ అంతా చెయ్యడానికి. మీకూ మీ పిల్లలకూ వండీవార్చి. సర్లెండి ఆ గొడవంతా ఎందుక్కాని ఆ తల జిడ్డంతా శుభ్ర మైన దిండుకు పట్టించేస్తున్నారు. తలెత్తండి- ఎంబ్రాయిడరీ కష్టపడి కుట్టుకున్నాను. ఆడదాని కష్టం మీకేవిటి తెలుస్తుంది. మగ మహారాజులు. మీవి గుండెలు కావు రాళ్ళు సినిమా కంటె అట్నుంచిటు కదిలారా? నేనేం పెద్ద ఆండాళ్ళమ్మలా వుంటానా- మీ కూడా వస్తే దెయ్యాన్నో భూతాన్నో వెంటబెట్టుకొచ్చినట్లుంటుందా! మీరేవన్నా పదహారేళ్ళ బాలాకుమారులా? నవనీత చోరులా! నందగోపాలురా! మీరు నా కంటె అందంగా వుంటాననుకుంటున్నారు కాబోలు! అందుకే అద్దం దగ్గర అంత సేపు కులకడం- ఆ క్రాపింగ్ అంత పొట్టి చేయించుకోకండి నీగ్రోలా - అంటే వినరు, నాకిష్టంలేదు, జుట్టుపొడుగ్గా వుంచుకోండి యించక్కా అంటే అమెరికన్ ఫాషన్ అంటూ దోడిగుండువతుగా చేయించుకొచ్చేశారు. మీ కేసి చూస్తే నాకు నిజంగా ఏడుపొచ్చింది. అస్లాకులు మరీ ఆడవాళ్ళ జాకిట్లలా కుట్టించుకోకండి అంటే విన్నారు కాదు ఒంటికిపట్టేసి రోడ్డుమీద ఎండలో గంట తిరిగొచ్చారంటె చెమట కంపు కొట్టుకుంటు బడుద్ధాయిలా కనిపిస్తారు నా కళ్ళకి.

నాకు మీ మొండితనం. మీ నిర్లక్ష్యం. మీ వేషం చూస్తూంటే నెత్తిమీద మొత్తాలనిపిస్తూ వుంటుంది, కాని చేతులురావు. ఏం చెయ్యను?

ఇది విన్నారా? సందులో వాటా కామాక్షిని మొగుడు ఏంతిక్క వచ్చిందోతోసేశాట్ట. కడుపుతోందా, పాపం సందులో పడిందట. అందుకే ఎబార్షన్.... రామః రామః చచ్చిబ్రతికింది కాల్జారింది, తూలింది. పడింది అని చెప్పుకున్నారు డాక్టరుతో - ఏం బ్రతుకు? ఆడదాని బ్రతుకు అఘ్వాన్నపు బ్రతుకు? ఇప్పుడు నా మటుకు నన్ను చూడండి. రక్తనూం సాలు హరించిపోయి ఆపిల్ పండులా వుండవలసిన దాన్ని అరిటికాయ తొక్కలా వున్నాను. మీరే మీరే మీరే నన్నిలా చేసేశారు. అటుపక్కకి ఒత్తిగిల్లండి. అబ్బ- చీరలన్నీ చిరిగిపోయాయండి. మేడమీద ఇంజసీరు గారి కోడలు కాతాలో చయించి రెండు చీరలు తెచ్చుకోనా? మాట్లాడరేవండి___ బెల్లంకొట్టిన రాయిలా___తెచ్చుకోమంటే తెచ్చుకోమనండి. లేకపోతే వద్దనండి. ఏ మాటా నోట్లోంచి వూడి పడదే పలుకే బంగారమయేనా? తెచ్చానులెండి- బీర్వాలో వున్నాయి. పొద్దున చూపిస్తాను. రంగులు మీరు చెప్పండి. మీకు నా సెలక్షను నచ్చుతుందో లేదో-అబ్బ-నిద్ర పట్టడంలేదండీ దోమలు-ఉండండి. ఏవిటోకుడుతున్నాయి. అబ్బబ్బ నల్లులండీ. పిల్లల్ని ఏం కుట్టి చంపుతున్నాయో.... లేవండి ప్లీజ్-మీ నడుంక్రింద మూడు నల్లులు పొతకల్లా వున్నాయి. దూరిపోయాయి. నల్లులు కుట్టేస్తూంటే షర్టూ బనీనూ లేకుండా ఏం నిద్ర పోతున్నారండీ? మీ కేడా ఇంక్రిమెంటు వస్తుందన్నారు వచ్చిందా- పెళ్ళాం వుద్యోగానికి ఇంక్రిమెంట్లు అవీ వుండవా? నేను కాపరాని కొచ్చి ఎన్నేళ్ళయిందీ? పదహారా? నాకు పదహారింక్రిమెంట్లు రావాలి. ఇప్పుడు అవన్నీ మీరిస్తే నాకు సంచీ రూపాయలవుతాయి. సంచీ రూపాయలంటే జ్ఞాపకం వచ్చింది. అక్కడ నా పేరవున్న పొలం అమ్మేసి ఇక్కడ మనం స్థలం కొంటే.ఇల్లు కట్టుకోవచ్చు. ఈ వెధవ అద్దె

కొంపల్లో వుండలేమండి. పిల్లలకు స్వేచ్ఛగా తిరిగేందుకు ఉండదు. ఇక్కడ కూర్చున్నారని అక్కడ నించున్నారని, అది ముట్టుకున్నారని పోరూ సాధింపూ వుండవు. నేనింత చెవిలో ఇల్లు కట్టుకు పోరుతున్నా మీకా ధ్యాస లేదేవండీ? మొగాడన్న వాడికి ఆయావ వుండాలి. ఒకరు చెబితే వస్తుందా! ఇల్లు లేకుండా ఇల్లాలేవిటి అద్దె కొంప ఇల్లవుతుందా? అద్దె కొంపల్లో కాపరం చేస్తే ఇల్లాలు ఇల్లాలవుతుందా? నాది అన్నదుం డాలి. గుండెలమీద చేయి వేసుకుని నిద్రపోయేందుకు. అదేవిటి గుం డెలమీద చేయివేసుకున్నారు? నిద్రలో కలవరింతలు వస్తాయి. భయం వేస్తుంది. ఆ చేయి తీసెయ్యండి ఈ మంచం ఏవిటో ఉయ్యాలలా వుంది. రేవన్నా బిగించాలి. ఈ పరుపు క్రింద ఏవిటి గుచ్చుకుంటున్నాది? ఏదీ అటు తిరగండి కొంచెం. ఇదుగోనండి మొన్న మీరు కనపడలేద న్నారు. పుస్తకం "ఓల్డ్ మాన్ అండ్ దసీ." ఇల్లంతా నడుం పడి పోయేట్టు వెతికించారు. నా చేత.

ఈ పరుపు క్రింద ఓ బీరువాడు సామానుంది. పాత ఉత్తరాలు, పుస్తకాలు, చేతి రుమాళ్లు డైరీలు. లేసులు ఒహటేవిటి. పడవలా వుంది. కాని యిది మంచంలా లేదు. ఏవండి అన్నట్లు ఈ పరుపు వుం డలు కట్టేసింది, రేపు దింపి బస్తాల కెత్తేస్తాను. పరుపు ఏకించి కుట్టించు కోవాలండీ. ఆ గళ్ళగుడ్డ తేకండీ బాబూ. మంచి నువ్వులో వాచల పైజామా గుడ్డో కుట్టిద్దాం ఈ సారి. శుభ్రమైన దిక్కు పరు పులూ, మంచాలూ వుండాలి. ఎవరైనావస్తే అసహ్యంగా పక్క బట్ట లుంటే చచ్చే సిగ్గేస్తుంది, ఎవరేనా వస్తే దుప్పట్లు వేసేందుకు అంద మైనవి వుండాలండీ. ఆ మధ్యన మీ ఫ్రండో కాయన వచ్చి మడతమం

ఛంగుష్ట పత్రమని చించేశాడు. ఇలాటి మడతమంచాలు విరగకొట్టే ఫ్రంద్సెక్కడ పోగయ్యారండీబాబూ! వాళ్ళు వొస్తే ఆ కుర్చీలమీద కూర్చోబెట్టండి కాని తీసుకొచ్చి మంచాలవీ ఎక్కించకండి. చాలాసిగ్గేస్తుంది. ఏవిటి అదంతా నిద్రే- నిద్రా దొంగ నిద్రా- ఏదీ జరగండి చెవటకంపు కొడ్తోంది ఏవిటో- - ఈ సన్నజాజి పూలచెండు ముక్కుమీద వేసుకుని పండుకుంటాను. నాకూ నిద్రముంచుకు వస్తోంది. కళ్లు మూతలుపడుతున్నాయి. మోచేత్తో పొడవకండి! నా కసలే చిరాకు.... కళ్ళుమూసుకు పడుకోండి. దేవుడ్ని తలుచుకోండి. అబ్బ ఈ పూలు ఎంత ఘుమఘుమలాడుతున్నాయో... ఓమాటా మంతీలేకుండా మొద్దునిద్ర- నేనిలా పిచ్చి మొద్దులా ఇందాకట్నుంచీ వాగుతున్నాను. ఇదుగో ఏమండోయ్ శ్రీవారూ- మీ పేరేవిటి? తెల్లారి లేచేవరకూ మీతో మాట్లాడను. మాట్లాడితే ఒట్టు!